
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 31 । మార్చి । 2024



సోమశిలలో 9.959 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం సాయంత్రానికి 9.959 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1,220 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) -	రూ.70,300
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.6,313
3 శాతం జీఎస్టీతో.. -	రూ.6,502
నవర (8 గ్రా) -	రూ.52,016

గరిష్ఠం/కనిష్ఠం
38.0 /25.0

వాతావరణం

శనివారం గాలిలో తేమ 63 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఆదివారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.



న్యూస్‌రీల్

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యం

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ

మనుబోలు: జాతీయ రహదారిపై మద్యం, నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే తమ లక్ష్యమని ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం రాత్రి మండలంలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లే వారు దానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను చూపాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించినట్లు తెలిస్తే సి-విజిల్ యాప్ ద్వారా లేదా టోల్ ఫ్రీ నంబర్ 112కు కాల్ చేసి తెలియజేయాలని కోరారు. ఆయన వెంట నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, మనుబోలు ఎస్సై అజయ్‌కుమార్ ఉన్నారు.

నేత్రపర్వంగా పుష్పయాగం



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పుష్పయాగాన్ని నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. అనంతరం దవనోత్సవం, ధ్వజావరోహణను భక్తిశ్రద్ధలతో జరిపారు.

తెప్పోత్సవం నేడు

శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథ స్వామి తెప్పోత్సవాన్ని పెన్నాలో ఆదివారం రాత్రి ఏడు గంటలకు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు దీనితో ముగియనున్నాయని ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

రేపటి నుంచి పది మూల్యాంకనం

నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. స్థానిక పొదలకూరు రోడ్డులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు మూల్యాంకనం ప్రారంభించనున్నారు. ఇందు కోసం 800 మంది సిబ్బందిని కేటాయించారు. ఇప్పటి వరకు 1.20 లక్షల పదో తరగతి జవాబు పత్రాలు ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. తొలుత జవాబు పత్రాలను కోడింగ్ చేయనున్నారు. ఏప్రిల్ 8వ తేదీ వరకు మూల్యాంకనం నిర్వహించనున్నట్లు డీఈఓ పీవీజే రామారావు తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ ఉద్యోగికి మెమో

నెల్లూరు సిటీ: నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఉదయగిరి శ్రీనివాస్‌కు జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు శనివారం మెమో జారీ చేశారు. వివరాలు.. ఇటీవల తిరుపతిరెడ్డి అనే వ్యక్తి స్టోన్‌హౌస్‌పేటలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్స్‌కు సంబంధించిన పనికోసం వచ్చారు. దరఖాస్తు చేసుకున్న తిరుపతిరెడ్డికి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఉద్యోగి ఆలస్యం చేశారు. దీంతో ఆ వ్యక్తి సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌ను ప్రశ్నించగా డబ్బులు డిమాండ్ చేశారని, తనతో దురుసుగా ప్రవర్తించారని బాధితుడు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. శ్రీనివాస్ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులును ఆదేశించారు. దీంతో బాలాంజనేయులు శ్రీనివాస్‌కు మెమో జారీ చేశారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



కంపసముద్రం వద్ద జరుగుతున్న రిజర్వాయర్ పనులు

మెట్టకు జలసిరులు

జిల్లాలోని మెట్టప్రాంత మండలాల్లో జలసిరులను పారించి పచ్చని పైర్లు పండించే లక్ష్యంతో చేపట్టిన సోమశిల హైలెవల్ కెనాల్ పనులు ఊపందుకున్నాయి. తొలుత భూసేకరణలో కొంత జాప్యం జరిగినప్పటికీ ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్ సూచనలతో అధికారులు ఆ పనులను వేగవంతం చేశారు. రెండో దశ నిర్మాణ పనుల్లో వేగం పెరగడంతో మెట్ట ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సోమశిల హైలెవల్ కెనాల్ పనులు వేగవంతం

- భూసేకరణ పూర్తి చేసేందుకు అధికారుల కసరత్తు
- కెనాల్ నిర్మాణం పూర్తయితే 90 వేల ఎకరాలకు సాగునీరు
- ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల ప్రజలకు తాగునీరు
- టీడీపీ హయాంలో భూసేకరణలో అక్రమాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీర్చి మెట్టప్రాంతంలో పంట సిరులు పండించాలనే లక్ష్యం నెరవేరే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం ప్రారంభించిన సోమశిల హైలెవల్ కెనాల్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మెట్టప్రాంత వాసులను ఆదుకోవాలనే లక్ష్యంతో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఈ అంశాన్ని అప్పట్లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో 2009లో సోమశిల ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేసి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

రూ.1,560 కోట్ల వ్యయంతో..

సోమశిల జలాశయం నుంచి 5 టీఎంసీల నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరం, మర్రిపాడు మండలాలు, ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరు, దుత్తలూరు, ఉదయగిరి మండలాల్లోని దాదాపు 90 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా, 58 రెవెన్యూ గ్రామాల్లో ఉన్న 2.36 లక్షల మందికి తాగునీరు అందించేలా పనులకు శ్రీకారం చుట్టారు. రూ.1,560 కోట్ల వ్యయంతో ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ఐదు మండలాల్లోని 5,320 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించారు. తొలి దశలో సోమశిల జలాశయం నుంచి కాలువ తీసి మర్రిపాడు మండలంలోని పొంగూరు, ఇస్కపల్లి, పడమటినాయుడుపల్లి, పెగళ్లపాడుల్లో రిజర్వాయర్లు నిర్మించి నీటిని నిల్వ చేసేలా ప్రణాళికలు రూపొందించారు. అందుకు గాను తొలి విడతగా రూ.840 కోట్లకు టెండర్ ఆహ్వానించగా మెగా కంపెనీ ఈ టెండర్‌ను దక్కించుకుంది. పనులు ప్రారంభించింది. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో ఆయా పనులు 57 శాతం వరకే పూర్తి చేశారు. ఇంకా 43 శాతం పనులు చేయాల్సి ఉంది. కేవలం పొంగూరు రిజర్వాయర్ వరకే పూర్తి చేశారు. ఇస్కపల్లి, పడమటినాయుడుపల్లిలో భూసేకరణ కూడా పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది.

టీడీపీ హయాంలో అక్రమాలు

సోమశిల హైలెవల్ కెనాల్ భూసేకరణలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. తొలి దశలో మర్రిపాడు మండలంలోని పొంగూరులో 0.5 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా రిజర్వాయర్ పనులు చేశారు. ఆ గ్రామంలో 1,200 ఎకరాల భూసేకరణ చేశారు. అందులో 270 ఎకరాలకు మాత్రమే పరిహారం ఇచ్చారు. మిగిలినవి చుక్కలు భూములు, ప్రభుత్వ భూములు ఉండడంతో 930 ఎకరాలకు పరిహారం పెండింగ్‌లో ఉంచారు. పొంగూరు రెవెన్యూలో మాత్రం ఎకరా బీడు భూమికి రూ.5 లక్షలు, బోరు, మోటార్ ఉన్న భూమికి రూ.5.5 లక్షల వంతున పరిహారం ఇచ్చారు. అలాగే పొంగూరు కండ్రిక సమీపంలో మాత్రం నేషనల్ హైవేకు అనుకుని ఉన్న భూములకు రూ.7 లక్షల వంతున పరిహారం ఇచ్చారు. ఒకే రెవెన్యూ పరిధిలో పరిహారం అందించడంలో ఇన్ని తేడాలు ఉండడం వెనుక భారీగానే చేతులు మారినట్లు తెలిసింది. అలాగే పెగళ్లపాడు, రాజులపాడు రిజర్వాయర్ల కోసం చేస్తున్న భూసేకరణలో కూడా భారీగానే చేతులు మారుతున్నాయన్న ఆరోపణలున్నాయి. పెగళ్లపాడులో రిజర్వాయర్‌కు దాదాపు 600 ఎకరాలు సేకరిస్తున్నారు. ఆ గ్రామంలో ఎకరాకు రూ.3.5 లక్షల వరకు నిర్ణయించి భూసేకరణ చేస్తున్నారు. అలాగే రాజులపాడు రిజర్వాయర్ కోసం దాదాపు 400 ఎకరాల భూసేకరణ కోసం ఎకరాకు రూ.4.5 లక్షలు నిర్ణయించారు. దీంతో కొందరు అక్రమార్కులు గత టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ భూములను వెబ్ అడంగల్‌లో పేర్లు నమోదు చేసుకొని నకిలీ డీ-ఫారం పట్టాలు సృష్టించి పరిహారం పొందారన్న ఆరోపణలున్నాయి. గత టీడీపీ హయాంలో ఓ తహసీల్దార్ ఎకరా ప్రభుత్వ భూమికి ఓ రేటు ఫిక్స్ చేసి వెబ్ అడంగల్‌లో పేర్లు నమోదు చేయించారన్న విమర్శలు వినిపించాయి.

నాసిరకంగా నిర్మాణాలు

సోమశిల జలాశయం నుంచి జరిగిన హైలెవల్ కెనాల్ పనులు నాసిరకంగానే జరిగినట్లు విమర్శలు ఉన్నాయి. పొంగూరు రిజర్వాయర్ పనుల్లో కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కట్టకు పగుళ్లు ఏర్పడ్డాయి. స్థానికంగా చెరువులో ఉన్న మట్టినే తీసి కట్టకు వేశారు. ఆ మట్టి వాడకూడదని నిపుణులు చెబుతున్నా నిర్మాణదారులు పట్టించుకోలేదు. పది కాలాలపాటు ఉండాల్సిన కట్ట పూర్తికాక ముందే పగుళ్లు ఏర్పడడంపై రైతుల్లో ఆందోళన నెలకొంది. గతంలో టీడీపీ నేతలకు మెగా కంపెనీ సబ్ కాంట్రాక్ట్‌కు ఇవ్వడంతో పనుల్లో నాణ్యత తగ్గిందని ఆరోపణలున్నాయి. పనులను నాసిరకంగా చేసి బిల్లులు తినేశారనే విమర్శలు వినిపించాయి.

రెండో దశలో..

సోమశిల హైలెవల్ కెనాల్ రెండో దశ పనులు పూర్తయితే ఉదయగిరి నియోజకవర్గం సగభాగం సస్యశ్యామలం అవుతుంది. మర్రిపాడు, దుత్తలూరు, వింజమూరు, ఉదయగిరి మండలాల్లోని 46,450 ఎకరాలకు సాగునీరు అందనుంది. రూ.648.98 కోట్ల వ్యయంతో రెండో దశ పనులను రివర్స్ టెండరింగ్‌తో 08.69 శాతం లెస్‌తో చేజిక్కించుకోగా ఆ కంపెనీకి రూ.459.63 కోట్లతో పనులు పూర్తి చేసేలా అగ్రిమెంట్ కుదిరింది. మర్రిపాడు మండలంలోని కంపసముద్రం, గుండెమడగల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల పనులను 36 నెలల్లో పూర్తి చేయాలని అగ్రిమెంట్ చేసుకున్నారు. ఆ పనులు పూర్తి చేస్తే ఆ మూడు మండలాల్లోని బీడు భూముల్లో పంట సిరులు పండే అవకాశం ఉంది. ఇటీవల ఈ పనుల పురోగతిపై ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. చుక్కల భూముల సమస్యలు, ఆరో విడత భూపంపిణీ అక్రమాల వల్ల భూసేకరణ సమస్యకు ఇబ్బందిగా ఉందని అధికారులు తెలుపగా త్వరితగతిన భూసేకరణ చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా కలెక్టర్‌తో ప్రత్యేక సమీక్షలు నిర్వహిస్తున్నారు. భూసేకరణ పనులు పూర్తి చేస్తుండడంతో నిర్మాణ పనులు ఊపందుకుంటున్నాయి.

సోమశిల హైలెవల్ కాలువ సామర్థ్యం - 5 టీఎంసీలు	
హైలెవల్ కెనాల్ రెండు దశలకు వ్యయం - రూ.1953.49 కోట్లు	
హైలెవల్ కెనాల్‌కు అవసరమైన భూమి - 5,320 ఎకరాలు	
ఇప్పటి వరకు సేకరించిన భూమి - 2,690 ఎకరాలు	
తొలి దశలో నిర్మిస్తున్న రిజర్వాయర్లు - 4	పూర్తయిన పనులు - 57 శాతం
రెండో దశలో నిర్మించనున్న రిజర్వాయర్లు - 3	
రెండో దశ పారుదల విస్తీర్ణం - 46,450 ఎకరాలు	

పనులు పూర్తయితే జలసిరులు



మెట్టప్రాంతంలో జరుగుతున్న సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణ పనులు పూర్తయితే సోమశిల జలాలతో పంటలు సమృద్ధిగా పండించుకునే అవకాశం కలుగుతుంది. కెనాల్ నిర్మాణ పనుల్లో వేగం పెరగడం సంతోషకరం. రానున్న రోజుల్లో సోమశిల జలాలు మా ప్రాంతంలో పంట సిరులు పండిస్తాయి.

– రాజాల జయరామిరెడ్డి, బ్రాహ్మణపల్లి, మర్రిపాడు మండలం

పనుల వేగవంతం సంతోషకరం



సోమశిల హైలెవల్ కెనాల్ పనులు వేగవంతం కావడం సంతోషకరం. ఈ పనులు పూర్తయితే మెట్ట ప్రాంతంలోని పొలాలకు సాగునీరందడమే కాకుండా తాగునీరు కూడా అందుతుంది. బీడు భూముల్లో సైతం పంటలు పండించుకునే అవకాశం లభిస్తుంది.

– బోవిళ్ల రాజారెడ్డి, కంపసముద్రం, మర్రిపాడు మండలం

తండ్రిని మించిన తనయుడు మహీధర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి సమక్షంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన రాపూరు సుందరరామిరెడ్డి

• వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి

కందుకూరు రూరల్: 'మానుగుంట కుటుంబం ప్రజా సేవకి అంకితమైంది. అప్పట్లో మానుగుంట ఆదినారాయణరెడ్డి, ఇప్పుడు ఆయన తనయుడు మహీధర్‌రెడ్డి ప్రజలకు అద్భుతమైన పాలన అందించారని' రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి అన్నారు. కందుకూరులోని వెంగమాంబ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ కార్యకర్తల పరిచయ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ గాలిలో ఇండిపెండెంట్‌గా గెలిచిన చరిత్ర మానుగుంట ఆదినారాయణరెడ్డికి ఉందన్నారు. మానుగుంట మహీధర్‌రెడ్డి తండ్రిని మించిన తనయుడిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అయితే సోషల్ ఇంజినీరింగ్‌లో భాగంగా కందుకూరు సీటును బీసీకి కేటాయించారని, పోటీలో మేమున్నా మా మార్గదర్శకుడు మానుగుంట మహీధర్‌రెడ్డేనని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. కందుకూరు ప్రజల మనస్సుల్లో ఆయన స్థానం పదిలమని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ ఎంపీ విజయసాయిరెడ్డి గెలుపు నెల్లూరు జిల్లా అభివృద్ధికి మలుపన్నారు. తాను ఎమ్మెల్యేగా, మహీధర్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించారని గుర్తుచేసుకున్నారు. ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారుడు జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని, కందుకూరు ఎమ్మెల్యేగా బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు.

నాకు టికెట్ రాలేదన్న బాధలేదు

'కందుకూరు నియోజకవర్గంలో కులాలకు అతీతంగా పని చేశాను. నాకు టిక్కెట్ రాలేదన్న బాధ లేదు' అని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి పూర్తిగా కట్టుబడి ఉన్నానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని, కందుకూరు ఎమ్మెల్యేగా బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యకర్తలు ఎలాంటి అపోహలకు పోకుండా కలిసి పనిచేసి కందుకూరులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన మహీధర్‌రెడ్డి ఆశీస్సులు తనకు కావాలన్నారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గ పరిశీలకుడు సుకుమార్‌రెడ్డి, కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ కనుమరుగు కావడం ఖాయం

నెల్లూరు(దర్గామిట్ట): సిద్ధాంతాలు లేని బీజేపీ, జనసేన పార్టీలతో తెలుగుదేశం పార్టీ జతకట్టిందని, త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల అనంతరం తెలుగుదేశం పార్టీ కనుమరుగు కావడం ఖాయమని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు, ఆ పార్టీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపూరు సుందరరామిరెడ్డి శనివారం నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనతోపాటు అనంతసాగరం మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ సద్దా రవీంద్రారెడ్డి, నుడా మాజీ డైరెక్టర్ ఖాజావలి, ఆత్మకూరు నియోజకవర్గ టూ వీలర్స్ అసోసియేషన్ నాయకులు మతీన్‌తోపాటు 50 మంది, ఏఎస్‌పేట మైనారిటీ నాయకుడు జునైద్‌బాషా వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, వైఎస్సార్‌సీపీ విధివిధానాలను చూసి సంతోషంతో పలువురు తమ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళి, నాయకులు గంగవరపు శ్రీనివాసులునాయుడు, డాక్టర్ ప్రణీత్, గడ్డం శ్రీనివాసులురెడ్డి, అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆర్‌ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు(టౌన్): వేసవి సెలవుల్లో ఆయా యాజమాన్యాల్లోని జూనియర్ కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐఓ శ్రీనివాసులు తెలిపారు. శనివారం నారాయణ, శ్రీచైతన్య, ఆర్ఎస్ఆర్, విశ్వసాయి, ఎస్ఆర్ తదితర కళాశాలలను ఆయన సందర్శించి ఈ విషయాన్ని ప్రిన్సిపల్స్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐఓ మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి మే 31వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. సెలవుల్లో నీట్, జేఈఈ, బ్రిడ్జి కోర్సుల పేరుతో కోచింగ్ గానీ, తరగతులు గానీ ఆయా కళాశాలల్లో నిర్వహించకూడదని తెలిపారు. ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్‌కు ఎగ్జామినర్లుగా నియమించిన అధ్యాపకులను ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ తప్పనిసరిగా పంపాలన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని, ఇంకా ప్రభుత్వం ఎలాంటి అడ్మిషన్ల షెడ్యూల్‌ను విడుదల చేయలేదని, నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వాన్ని ఆదరించండి



మంత్రి కాకాణికి వరి వెన్నుల మాల వేస్తున్న రైతులు

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించి ఆదరించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. మండలంలోని జట్లకొండూరు, చెర్లోపల్లి, కుడితిపల్లి, గోవిందరాజపురం, బండేపల్లి గ్రామాల్లో శనివారం రాత్రి మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏదోరకంగా కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లేయించుకుని అధికారంలోకి రావడం, ఆపై ప్రజలను వంచించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. గతంలో 600 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అనంతరం వాటిని తుంగలో తొక్కారని గుర్తుచేశారు. రుణమాఫీ పేరుతో రైతులను, పొదుపు మహిళలను మోసం చేశారన్నారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి సంక్షేమ పాలన సాగిస్తున్నారని తెలిపారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా పాలనను ప్రజల ముంగిటకే తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చంద్రబాబు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు అవకాశవాద పొత్తులతో సిద్ధమయ్యారని తెలిపారు. గత చంద్రబాబు పాలనను, ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను బేరీజు వేసుకుని ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతకుముందు మంత్రి కాకాణికి చేడిమాల బుజ్జిరెడ్డి, ఆవుల తులసీరాం, గుంజి రమేష్, ఆవుల వెంకటరమణయ్య తదితరుల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. రైతులు మంత్రిని వరి వెన్నుల మాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, సర్పంచ్‌లు చేడిమాల శ్రీలత, నాగమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు వెందోటి భాస్కర్‌రెడ్డి, చేడిమాల రమణకుమార్‌రెడ్డి, చిలకూరు మోహన్‌రెడ్డి, ఆవుల జగదీష్, ఆవుల రమేష్, యరమాపు శంకర్‌రెడ్డి, చెన్నూరు రామశేషారెడ్డి, చేడిమాల వెంకటసుబ్బారెడ్డి, ఇసనాక రాజారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిబంధనల మేరకు వ్యాపారాలు చేసుకోండి



మాట్లాడుతున్న రంగయ్యనాయుడు

నెల్లూరు(పొగతోట): సార్వత్రిక ఎన్నికల నియమావళి జూన్ 6వ తేదీ వరకు అమల్లో ఉంటుందని, అప్పటి వరకు ఎన్నికల నిబంధనలకు లోబడి ధాన్యం కొనుగోళ్లు, ఇతర వ్యాపార లావాదేవీలు నిర్వహించుకోవాలని ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఏసీసీ) నెల్లూరు జోన్ చైర్మన్ వై రంగయ్యనాయుడు, సమన్వయకర్త ఏవీఎస్ కృష్ణమోహన్ వ్యాపారులకు సూచించారు. నగరంలోని ఏసీసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల కమిషన్ వ్యాపార లావాదేవీల తనిఖీకి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిందన్నారు. కూపన్లకు వస్తువులు ఇవ్వడం, గతంలో కన్నా ప్రస్తుతం అధికంగా విక్రయాలు చేసినా తనిఖీలు చేసి వ్యాపార సంస్థలను సీజ్ చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. భారీ స్థాయిలో ఆర్డర్లు వస్తే వాస్తవాలు పరిశీలించి సరఫరా చేయాలని సూచించారు. జిల్లాలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. రూ.450 కోట్లకు పైగా ధాన్యం విక్రయాలు జరిగే అవకాశం ఉందన్నారు. ధాన్యం కొనుగోలు చేసే రైస్‌మిల్లర్లు, వ్యాపారులు రశీదులు అందుబాటులో ఉంచుకుని నగదు తీసుకెళ్లాలని సూచించారు. తనిఖీల సమయంలో అధికారులు నగదు పట్టుకుంటే రశీదులు ఉంటే విడుదల చేస్తారన్నారు. ఎటువంటి రశీదులు, పత్రాలు లేకుండా నగదు దొరికితే కేసులు నమోదు చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఏసీసీ సభ్యులు రమేష్‌బాబు, బలరామయ్యనాయుడు పాల్గొన్నారు.

ప్రలోభాలకు లొంగి మోసపోవద్దు

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: తమ అవసరం కోసం ప్రతిపక్ష పార్టీలు ఆశ చూపే ప్రలోభాలకు లొంగి మోసపోకుండా త్వరలో జరిగే ఎన్నికల్లో అభివృద్ధి ప్రదాతలను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మైపాడు మజరా కృష్ణాపురంలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు లేక, ప్రభుత్వ పథకాలు అందక మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని గమనించి సీఎం వైఎస్ జగన్ సహకారంతో 33 మంది కి 31.64 ఎకరాలకు అసైన్‌మెంట్ పట్టాలు అందజేసి శాశ్వత హక్కులు కల్పించామని తెలిపారు. రూ.35 లక్షలతో కృష్ణాపురంలో ఇంటింటికీ మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేశామని చెప్పారు. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.25.68 లక్షలతో పీడీకండ్రిగలో బోరువేసి మోటార్‌ను ఏర్పాటు చేసి సుమారు 4.5 కిలోమీటర్ల మేర పైపులైన్ వేసి కృష్ణాపురానికి తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. నుడా నిధులు రూ.75 లక్షలు, ఎంపీ ఆర్ కృష్ణయ్య ఎంపీ నిధులు రూ.10 లక్షలు కలిపి మొత్తం రూ.85 లక్షలతో సిమెంట్‌రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఎంపీ నిధులు రూ.5 లక్షలతో ఆర్వో ప్లాంట్ నిర్మించామని చెప్పారు. కృష్ణాపురంలోని మత్స్యకారులకు రూ.8.98 కోట్లతో సంక్షేమ లబ్ధి చేకూర్చిన ఘనత మన సీఎం వైఎస్ జగనోకే దక్కిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జొన్నవాడ ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

లోపాలున్న పిల్లలకు ఉచితంగా వైద్యసేవలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): శారీరక లోపాలతో బాధపడుతున్న 19 ఏళ్ల లోపు పిల్లలకు బాలభవిత కేంద్రం ద్వారా ఉచితంగా ఖరీదైన వైద్యసేవలను అందిస్తున్నామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తెలిపారు. నేషనల్ బర్త్ డిఫెక్ట్ మాసాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని బాలభవిత కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రహణమొర్రి, వినికిడి, ఎదుగుదల లోపాలు, మాట్లాడలేకపోవడం, న్యూరాల్‌ట్యూబ్, డౌన్ సిండ్రోమ్, నాడీ తదితర సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు ఉచితంగా చికిత్సలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటికే 413 మంది చిన్నారులను గుర్తించి కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నామన్నారు. వివరాలకు కేంద్రం మేనేజర్ జమీర్‌ను 93814 68458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, ప్రోగ్రాం ఆఫీసర్ సుధీర్‌కుమార్, చిన్నపిల్లల స్పెషలిస్ట్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: రానున్న ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ పరిధిలోని కృష్ణారెడ్డిపాళెం, రాజుపాళెం, చంద్రారెడ్డిపాళెం గ్రామాల్లో విజయ సంకల్పయాత్రను శనివారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం చేసిన మేలుతోనే వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రజల వద్దకు ధైర్యంగా ఓటు అడిగేందుకు వెళ్తున్నారన్నారు. సీఎం జగన్ సిద్ధం సభలకు వస్తున్న ప్రజాదరణను చూసి టీడీపీ కూటమికి వణుకు పుడుతోందన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యేగా తనను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, సర్పంచ్ నలతాటి మహాలక్షమ్మ, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీనివాసులురెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఆదిశేషారెడ్డి, స్థానిక నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, రఘురామిరెడ్డి, నరసింహారెడ్డి, యాదగిరి, మనోహర్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, వెంగళరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రామిరెడ్డితోనే కావలికి మహర్దశ

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



వస్త్ర వ్యాపారులను కలుసుకుని ఓట్లు అభ్యర్థిస్తున్న ఎంపీ బీద, ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: కావలిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయగల సామర్థ్యం, చిత్తశుద్ధి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి మాత్రమే ఉన్నాయని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని ఐదు వస్త్ర దుకాణాల సముదాయాల్లో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ బీద మాట్లాడుతూ గత రెండు ఎన్నికల్లో ప్రతాప్‌రెడ్డిని వస్త్ర వ్యాపారులు ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. ఈ దఫా కూడా అదే విధంగా ఆశీర్వదించాలని కోరా రు. కావలి ప్రగతికి సంబంధించి ప్రతాప్‌రెడ్డికి స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయన్నారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణాల ద్వారా కావలిని జిల్లాకే తలమానికంగా తీర్చిదిద్దుతున్నారని వివరించారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే దామవరం విమానాశ్రయ పనులు ప్రారంభమవుతాయని, అది అందుబాటులోకి వస్తే వస్త్ర వ్యాపారులకు చాలా అనుకూలంగా ఉంటుందన్నారు. వ్యాపార నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే వస్త్ర వ్యాపారుల కోసం కావలి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్ల స్టాపింగ్‌కు ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ దఫా నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి బరిలో ఉన్నారని, కేంద్రంతో సత్సంబంధాలు ఉన్న ఆయన ద్వారా కావలి ప్రగతి మరింత పరుగులు పెడుతుందన్నారు. ఎన్నికల్లో తెలియని వ్యక్తులకు ఓటేసి తరువాత బాధపడే కన్నా వస్త్ర వ్యాపారులు సొంత కుటుంబ సభ్యుడిలా ఉండే ప్రతాప్‌రెడ్డి, విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ గత రెండు దఫాలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించడంలో కీలక పాత్ర పోషించిన వ్యాపారులందరికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఈదఫా కూడా అదే అభిమానంతో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, అమరా వేదగిరి సుబ్బరాయుడుగుప్తా, చీదెళ్ల కిషోర్ గుప్తా, బాలాజీ సత్య, తదితరులు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన **దుగ్గా శివప్రసాద్ తండ్రి చలమారెడ్డి**, బాలాజీనగర్, నెల్లూరు సిటీ అను వారు ఇచ్చిన వివరముల మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా :- నా క్లయింట్ ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని **తోటపల్లి చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి లేట్ కోదండరామిరెడ్డి, మైపాడు** గ్రామం, **ఇందుకూరు పేట** మండలం, **శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు** జిల్లా అను వారి వద్ద నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొనినారు. కావున క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిపై ఎటువంటి పరాధీనములు, ఆడుమానములు, అగ్రిమెంట్లు, క్లైములు, జప్తులు, లీజులు, కోర్టు వ్యవహారములు మరి ఏ ఇతరములైన వున్న యెడల యీ పత్రికా ప్రకటన వెలువడిన తేది నుండి 7 రోజుల లోగా యీ క్రింది అడ్రస్సుకు లిఖితపూర్వకముగా సరియగు ఆధారములతో తెలుపుకోవలసినది. తదుపరి వచ్చు అక్షేపణలు నా క్లయింట్‌ను బద్ధగించవు.

ఆస్థి షెడ్యూలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, **ఇందుకూరుపేట** సబ్ రిజిస్ట్రారు, **ఇందుకూరుపేట** మండలం, **మైపాడు** గ్రామ పంచాయతీ, **మైపాడు** గ్రామములోని **సర్వే నెం.357రులో య.0-73 ట్లు, సర్వే నెం.358-ఎ రులో య0-50ట్లు, సర్వే నెం.358-బి రులో య0-32 ట్లు, సర్వే నెం.359రులో య 0-88 ట్లు, సర్వే నెం.360-ఎ రులో య0-82ట్లు, సర్వే నెం. 361 రులో య0-90 ట్లు వెరశి య 4-15 ట్లు** మాగాణి భూమికి **హద్దులు :- తూర్పు :** తోటపల్లి కోదండరామిరెడ్డి గారి భూమి. **దక్షిణం :** పట్నం బాలిరెడ్డి గారి భూమి. **పడమర :** పారుదల కాలువ. **ఉత్తరం :** పారుదల కాలువ.

వి.రాజా, B.Com., L.L.B., **జె.శ్రీనివాస్,** B.Com., L.L.B.,
అడ్వకేట్స్, శ్రీరామమందిరం ఎదురుగా, ఫత్తేఖాన్‌పేట, నెల్లూరు సిటీ. సెల్: 9000334777

శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము
పెంచలకోన క్షేత్రము, రాపూరు (మం), శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
Email: eo.penchalakona@gmail.com Ph:08621-221604, Cell : 9491000737

ప్రకటన నెం. 21/2024 తేది. 30. 03. 2024

టెండరు ప్రకటన

పై దేవస్థానము నందు 2024 సం॥ బ్రహ్మోత్సవములు **తేది. 19.05.2024 నుండి తేది. 25.05.2024 వరకు** జరుగు సందర్భంగా దిగువ పనులు చేయుటకు **తేది.13.04.2024** ఉదయం గం॥11.00లకు సీల్డ్ టెండర్లు పిలువబడుచున్నవి.

వ.సెం.	పని వివరములు	ధరావత్తు
1	ఎలక్ట్రికల్ డెకరేషన్ చేయుట	రూ. 50,000/-
2	పుష్పం సరఫరా చేయుట	రూ. 25,000/-
3	పుల్లకోత కోయుట	రూ. 10,000/-
4	సున్నం వేయుట	రూ. 10,000/-
5	బ్రహ్మోత్సవ కార్యక్రమములు వీడియో, ఫోటోలు తీయుట, ఎల్.ఇ.డి. స్క్రీన్స్ ఏర్పాటు చేయుట	రూ. 10,000/-
6	వాల్‌పోస్టర్లు, కరపత్రములు, క్యాలెండర్లు ముద్రణ	రూ. 10,000/-
7	హైరర్స్ సామాన్లు సరఫరా చేయుట	రూ. 10,000/-
8	స్పెషల్ మేళం ఏర్పాటు చేయుట	రూ. 10,000/-
9	తేది.20.05.2024 నుండి తేది.25.05.2024 వరకు రోజుకు 20 మంది చొప్పున సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయుట	రూ. 10,000/-
10	ప్రచారం నిమిత్తం ఫ్లెక్స్ బ్యానర్స్ తయారు చేయుట	రూ. 10,000/-
11	ప్రచారం నిమిత్తం ప్రతిగ్రామం నందు వాల్‌పోస్టర్లు అంటించుట	రూ. 10,000/-

షరతులు:

గమనిక :- 1.టెండరు షెడ్యూళ్లను **తేది:08.04.2024** నుండి **తేది: 13.04.2024** ఉదయం 10.00ల వరకు **రూ.2000/-లు** చెల్లించి పొందవచ్చును. **2.**పూర్తి చేసిన టెండర్లను **తేది:13.04.2024 ఉ॥ గం.11.00 లోపు** టెండరు బాక్సు నందు దాఖలు చేయవలెను. **3.**టెండర్లను అదే రోజు **మ॥ గం.1.00 లకు** టెండరుదారుల సమక్షములో తెరువబడును. ఇతర వివరములను ఆఫీసు పనివేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

సం/- **కె.విజయసాగర్‌బాబు,**
ఉప కమీషనరు & కార్యనిర్వహణాధికారి

టీడీపీకి ఓటేస్తే సంక్షేమ పథకాలు రద్దు

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో ఆదాలకు హారతి పడుతున్న మహిళ

నెల్లూరు సిటీ: వచ్చే ఎన్నికల్లో పొరపాటున ప్రజలు తెలుగుదేశం పార్టీకి ఓటేసి గెలిపిస్తే సంక్షేమ పథకాలన్నీ రద్దు అయిపోతాయని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 32వ డివిజన్‌లో శనివారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు పారదర్శకంగా ఇంటి వద్దకే అందుతున్నాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే రెండు వ్యవస్థలు కనుమరుగవుతాయన్నారు. రూరల్ నియోజకవర్గం నుంచి రౌడీలు, భూ కబ్జాదారులు, అవినీతిపరులు, నమ్మకద్రోహులకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. నిత్యం ప్రజలతో ఉంటూ అభివృద్ధి చేసే వ్యక్తులకు ఓటేయాలని కోరారు. తనను ఆశీర్వదిస్తే వచ్చే ఐదేళ్లలో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని రూ. 1500 కోట్లతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చా రు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మేయర్ స్రవంతి, రైల్వేబోర్డు సభ్యుడు స్వర్ణ వెంకయ్య, ఏఎంసీ చైర్మన్ పీ కోటేశ్వరరెడ్డి, సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు మలిరెడ్డి కోటారెడ్డి, ఉదయగిరి నరసింహులుగౌడ్, 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్, డివిజన్ నాయకులు అజీజ్, నందూరి హరితరెడ్డి, రెహమాన్, రజాక్, తదితరులు పాల్గొ న్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.65
పండు	: రూ.25

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 145
లేయర్ (లైవ్)	: 73
బ్రాయిలర్ చికెన్	: 254
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 284
లేయర్ చికెన్	: 125

సాక్షి క్లాసిఫైడ్స్

సాక్షి ఫ్యామిలీ

IV

నెల్లూరు

ఆదివారం ॥ 31-3-2024

వైరల్



ఆడపిల్లే అదృష్టదేవత

పైలట్ టీనా గోస్వామి ఆసక్తికరమైన వీడియోలను 'పైలట్ మమ్మీ' శీర్షికతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తుంటుంది. తాజాగా పోస్ట్ చేసిన ఒక బామ్మ వీడియో వైరల్‌గా మారింది. గ్రామీణత ఉట్టిపడే ఆహార్యంతో కనిపిస్తున్న ఒక బామ్మ అయోధ్య ధామ్‌కు వెళ్లే విమానంలోకి మెట్లకు నమస్కరిస్తూ ఎక్కింది. విమానంలో కనిపించిన పైలట్ టీనా గోస్వామిని ఆప్యాయంగా పలకరించింది. 'మన భారతీయ సనాతన సంస్కృతిలో ఆడపిల్ల.. మన లక్ష్మి' అంటూ టీనాను ఆశీర్వదించింది. బామ్మ కాళ్లకు గౌరవంగా నమస్కరించింది టీనా. రెండు మూడు రోజుల వ్యవధిలోనే ఈ వీడియో ముప్పై లక్షల వ్యూస్ దక్కించుకుంది. హృదయాన్ని హత్తుకునే ఈ వీడియో గురించి కామెంట్ సెక్షన్‌లో ప్రశంసలు వెల్లువెత్తాయి.

సంతకాన్ని జంతర్‌మంతర్ చేసినచో...

శూన్యంలో నుంచి కూడా కళను సృష్టించే నైపుణ్యం ఆర్టిస్ట్‌ల సొంతం. తాజా విషయానికి వస్తే... ఇండిగో ఫ్లైట్ అటెండెంట్ తెల్లకాగితంపై చేసిన సంతకాన్ని క్షణాల్లో అందమైన చిత్రంగా మార్చాడు రాబిన్ బార్. సంతకం నుంచి అప్పటికప్పుడు ప్రేయసీప్రియులను సృష్టించిన రాబిన్ బార్ ఇలాంటి అలాంటి ఆర్టిస్ట్ కాదు...రికార్డ్ హోల్డర్ స్పీడ్ పెయింటర్. జస్ట్...కొన్ని రోజుల వ్యవధిలోనే ఈ వీడియో క్లిప్ 21 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. రాబిన్ బార్‌పై నెటిజనుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి.





వీల్‌చైర్‌లో వచ్చాడు... విల్‌పవర్ చూపాడు

వీల్‌చైర్‌కు పరిమితమైన ఈ యువకుడు విల్ పవర్ మాత్రం ఎప్పుడూ కోల్పోలేదు. స్నేహితుల సహాయంతో వీల్‌చైర్‌లో నుంచి రిషికేష్‌లో బంగీ జంప్ చేశాడు. ఈ వీడియోతో ప్రపంచవ్యాప్తంగా నెటిజనుల మనసు దోచుకున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 24 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 'ఎవ్రీథింగ్ ఈజ్ పాసిబుల్ ఇఫ్ యూ డేర్' 'మోర్ పవర్ టు యూ, బాయ్'లాంటి కామెంట్స్ కనిపించాయి. చాలామంది హార్ట్ ఇమోజీలతో రియాక్ట్ అయ్యారు. గతంలో లెఫ్టినెంట్ కల్నల్ అవనీష్ బాజ్‌పాయ్ ఆర్టిఫిషియల్ లింబ్‌తో భటిండాలో 14,000 అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది.

సెల్ఫ్-లవ్



వెనకటికి ఒక ఈగ ఇల్లలుకుతూ ఇంటి పనుల్లో పడి పేరు మరచిపోయిందట. చాలామంది మహిళలు ఇంటిపనుల్లో తలమునకలై పోయి తమ ఇష్టాలను మరచిపోతుంటారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రొఫెసర్ ఫల్గుణి గృహిణుల కోసం ఒక వీడియో చేసింది.

'మహిళలు తమ భర్త, పిల్లల కోసం ఇష్టమైన వంటకాలను తయారుచేసే వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయడం చూశాను. మరి మీ కోసం ఎప్పుడు తయారు చేస్తారు? మీ కుటుంబ సభ్యులకు నచ్చిన వంటకాల గురించి మాత్రమే కాదు మీకు నచ్చిన వాటి గురించి కూడా దృష్టి పెట్టండి' అంటూ తనకు బాగా నచ్చిన వంటకాన్ని తయారుచేస్తున్న వీడియోను ఫల్గుణి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఈ వైరల్ క్లిప్ 1.4 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఈ వీడియో క్లిప్ చూసి ఒక మహిళ ఇలా స్పందించింది... 'నీకు ఇష్టమైనది చేసి పెడతాను. ఏంచేయమంటావు అని అడిగింది అమ్మ. వెంటనే సమాధానం చెప్పలేకపోయాను. పెళ్లయిన తరువాత ఇంటిపనుల్లో పడి నాకు ఇష్టమైన వంటకం ఏమిటో కూడా మరిచిపోయాను. ఈ వీడియో చూసిన తరువాత సెల్ఫ్-లవ్ ప్రాముఖ్యత గురించి రియలైజ్ అయ్యాను'

ధోనీ... ఈసారి ఇలా కానియ్!



ఎం.ఎస్. ధోనీ కెప్టెన్‌షిప్ క్వాలిటీస్ మాత్రమే కాదు సరికొత్త హెయిర్ స్టైల్, సరికొత్త బైక్ కూడా నెటిజనులకు ఆసక్తికరమే. తాజాగా ధోని 'డూడుల్ వీ3 ' ఇ-బైక్ రైడింగ్ వీడియో వైరల్ అయింది. రోజుల వ్యవధిలోనే 1.3 మిలియన్‌ల వ్యూస్‌తో దూసుకుపోతుంది. ధోని రైడింగ్ వీడియోలు వైరల్ కావడం కొత్త కానప్పటికీ ఎకో-ఫ్రెండ్లీ మోడ్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్‌ను ప్రమోట్ చేసే ఈ మేడ్-ఇన్-ఇండియా ఎలక్ట్రికల్ సైకిల్ వీడియో నెటిజనులలో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది.

హాయి హాయిగా... కూల్ కూల్‌గా!

ఎలాంటి క్యాప్షన్ లేకుండా రమీజ్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన చెన్నై ఆటోడ్రైవర్ వీడియో 3 కోట్ల ఎనభై ఎనిమిది లక్షలకు పైగా వ్యూస్‌తో దూసుకుపోతోంది. 'ఏమిటీ ఆటోడ్రైవర్ స్పెషాలిటీ?' అనే విషయానికి వస్తే... ఎండా కాలంలో చెన్నైలో వేడి అంతా ఇంతా కాదు. ఈ వేడిని తట్టుకోవడానికి సదరు ఆటోడ్రైవర్ ఎకో ఫ్రెండ్లీ ఏసీ ఫ్యాన్‌ను తయారుచేసి తన ఆటోలో బిగించాడు. ఆటోడ్రైవరే కాదు ప్రయాణికులు కూడా హాయి హాయిగా కూల్ కూల్‌గా ప్రయాణిస్తున్నారు.



వద్దమ్మా.. తప్పూ!



ఈ మధ్య 'గైడింగ్ హ్యాండ్స్' అంటూ ఒక వీడియో వచ్చింది. అది వెక్కిరింత వీడియో. ఫోన్ చూసుకుంటూ తల ఎల్లవేళలా కిందకు దించి ఉండేవారిని చేయి పట్టి చేరవలసిన చోటుకు చేర్చే 'సహాయక చేతులను' భవిష్యత్తులో ఉపాధిగా చేసుకోవచ్చని అందులో చూపుతారు. అంటే అంధులను చేయి పట్టి నడిపించే వారికి మల్లే ఈ ఫోన్ బానిసలను చేయి పట్టి నడిపించి చార్జ్ తీసుకునే వ్యక్తులు భవిష్యత్తులో వస్తారన్న మాట. మనం ఫోన్‌కు శ్రుతి మించి ఎడిక్ట్ అయ్యామని చెప్పేందుకు ఈ వీడియో చేశారు. బండి మీద వెళుతూ ఫోన్ మాట్లాడితే ప్రమాదం అని ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ వినడం లేదు. కొందరు హెల్మెట్‌లో దూర్చి మరీ ఫోన్ మాట్లాడుతూ ప్రమాదం బారిన పడతారు. మరికొందరు హెడ్‌ఫోన్స్‌తో మాట్లాడుతూ వెనకొచ్చే వాహనాల హారన్ వినక ప్రమాదంలో పడుతున్నారు. మొన్నటి మార్చి 26న బెంగళూరు విద్యారణ్యపురలో ఒక మహిళ ఇలా ఫోన్ బిగించి కట్టి మాట్లాడుతూ ఒక వ్యక్తి కెమెరాకు చిక్కింది. అతను షూట్ చేసి ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యింది. అందరూ ఇలా చేయడం ప్రమాదం అన్నారు. ఈ ఎండల్లో ఫోన్ వేడెక్కి పేలినా ప్రమాదమే అని మరికొందరు హెచ్చరించారు. పోలీసులు ఏం చేస్తున్నారని కొందరు ప్రశ్నించారు. చివరకు వీడియో పోలీసుల వరకూ వెళ్లింది. బండి నంబర్ ఆధారంగా ఆ మహిళను గుర్తించి యలహంక ట్రాఫిక్ స్టేషన్ వారు 5 వేల రూపాయల ఫైన్ వేశారు. అవసరమా ఇదంతా?

హెల్త్



కుటుంబ సభ్యుల ఆరోగ్యం మీద పెట్టినంత శ్రద్ధ తమ విషయానికి వచ్చేసరికి మహిళలు గాలికి వదిలేస్తారు. కుటుంబ సభ్యులు కూడా అంతగా పట్టించుకోరు. దాంతో ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చి, అది తీవ్రరూపం దాల్చేవరకు ఎవరూ సీరియస్‌గా తీసుకోరు. అలాంటి సమస్యల్లో 'డీప్ వీన్ థ్రాంబోసిస్' ఒకటి. ఇది స్త్రీ, పురుషులిద్దరికీ వచ్చే సమస్య అయినప్పటికీ... మహిళల్లో రిస్క్ ఫ్యాక్టర్స్ ఎక్కువ. గర్భధారణ నుంచి హార్మోన్ల సంక్లిష్టతల వరకు అనేక అంశాలు డీప్ వీన్ థ్రాంబోసిస్‌కు దారితీస్తాయి. రక్తనాళాల్లో... ప్రధానంగా చెడు రక్తాన్ని తీసుకెళ్లే సిరల్లో రక్తం గడ్డకట్టడాన్ని 'డీప్ వీన్ థ్రాంబోసిస్' (డీవీటీ)గా చెబుతారు. ఈ సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.

మహిళకు డీప్ వీన్ థ్రాంబోసిస్ చేసే చేటు!

డీప్ వీన్ థ్రాంబోసిస్ అనేది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. కాలి సిరల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. ఇంచుమించు ప్రతి 20 మందిలో ఒకరికి... వారి జీవితకాలంలో డీప్ వీన్ థ్రాంబోసిస్ బాధపెడుతుంది.

మహిళల్లోనే ప్రభావం చూపడానికి కారణాలు...

1. **ప్రెగ్నెన్సీ:** స్త్రీలలో ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపించడానికి గల కారణాలలో గర్భధారణ ఒకటి. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం తర్వాత ఆరు వారాల వరకు ఈ ముప్పు ఉంటుంది. గర్భధారణ తర్వాత రక్తనాళాల్లో రక్తప్రవాహం కాస్త నెమ్మదించడం మామూలే. దాంతో రక్తం గడ్డ కట్టే అవకాశాలు పెరగడం.
2. **గర్భసంచి బాగా సాగడం:** దీంతో రక్తనాళాలపై ఒత్తిడి పడి రక్తం సాఫీగా ప్రవహించడానికి ఆటంకం కలుగుతుంది.
3. **నోటి ద్వారా తీసుకునే గర్భనిరోధక మాత్రలు:** వీటిల్లోని హార్మోన్లతో డీప్ వీన్ థ్రాంబోసిస్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. దాదాపు ప్రతి గర్భనిరోధక మాత్రలో ఈస్ట్రోజెన్, ప్రోజెస్టిన్ ఉండటంతో అవి రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టేలా చేసే అవకాశాలు పెరుగుతాయి. పైగా ఈస్ట్రోజెన్... కాలేయాన్ని ప్రేరేపించి... రక్తంలో ఉండే బ్లడ్ క్లాటింగ్ ఫ్యాక్టర్ రక్తం గడ్డకట్టేలా చేసే ఫైబ్రినోజెన్‌ను ఎక్కువగా స్రవింపజేస్తుంది. దీనికితోడు గర్భనిరోధక మాత్రల్లో వాడే కొన్ని రకాల కాంబినేషన్స్ పిల్స్ వల్ల ఈ ముప్పు మరింత పెరుగుతుంది. అందువల్ల గర్భనిరోధక మాత్రలు వాడే వారు డాక్టర్ సలహా మేరకే వాడాలి.
4. **హార్మోనల్ రీప్లేస్‌మెంట్ థెరపీ:** మెనోపాజ్ తర్వాత తీసుకునే హార్మోనల్ రీప్లేస్‌మెంట్ థెరపీలోని మందుల్లో ఈస్ట్రోజెన్, ప్రోజెస్టిన్ కాంబినేషన్ ఉంటుంది. ఈ ఈస్ట్రోజెన్ పైన పేర్కొన్న ప్రభావాన్నే చూపడంతో డీప్ వీన్ థ్రాంబోసిస్ ముప్పు పెరుగుతుంది. అందువల్ల ఈస్ట్రోజెన్ మందుల్ని చర్మానికి అంటించే ప్యాచ్‌ల రూపంలో ఇస్తే ఈ ముప్పు తగ్గుతుంది.
5. **జీవనశైలి అంశాలు:** శారీరక శ్రమ లేకుండా ఒకేచోట ఎక్కువసేపు కూర్చుని ఉండటం, స్థూలకాయం, పొగతాగడం వంటివి రక్తప్రవాహానికి ఆటంకం కలిగిస్తాయి. స్మోకింగ్ ద్వారా దేహంలోకి చేరే నికోటిన్ రక్తాన్ని గడ్డకట్టేలా చేస్తుంది.



వేర్వేరుగా లక్షణాల తీవ్రత...

డీప్ వీన్ థ్రాంబోసిస్‌లో రకరకాల లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఆ లక్షణాలన్నీ అందరిలోనూ కనిపించకపోవచ్చు. దానికితోడు లక్షణాల తీవ్రతలో కూడా మార్పులుండవచ్చు. కొందరిలో రక్తపు గడ్డ చిన్నదిగా ఉంటే కొందరిలో అసలు ఎలాంటి లక్షణాలూ కనిపించకపోవచ్చు. సమస్య దానంతట అదే సమసిపోవచ్చు కూడా.

కొన్ని సాధారణ లక్షణాలు...

- రక్తం గడ్డ కట్టినచోట చర్మం వాపు (ముఖ్యంగా కాలు, పాదం వంటివి)
- చర్మం ఎర్రబారడం, అక్కడ వేడిగా ఉన్నట్లు అనిపించడం
- ఒక్కోసారి చర్మంలోంచి రక్తనాళాలు కనిపించడం
- కాలిలో డీవీటీ ఏర్పడినప్పుడు కాలు బలహీనంగా ఉన్నట్లు అనిపించడం
- రక్తనాళాలు గట్టి పడడం

ఈ లక్షణాలు అకస్మాత్తుగా కనిపించినా లేదా కాలం గడుస్తున్న కొద్దీ తీవ్రత పెరుగుతూ పోతున్నా వెంటనే డాక్టర్‌కు చూపించాలి. కొన్నిసార్లు రక్తనాళంలో ఏర్పడ్డ ఈ గడ్డ (క్లాట్) రక్తప్రవాహంలో కొట్టుకుపోతూ, గుండె రక్తనాళాల్లోకి చేరి, గుండెస్పందనలను ఆపివేసే 'పల్మనరీ ఎంబాలిజమ్' అనే కండిషన్‌కు దారితీసే ప్రమాదం ఉంటుంది.



నివారణ...

- మంచి సమతులాహారం తీసుకోవడం అంటే పొట్టు తీయని కాయధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరలు, తాజా పండ్లు తీసుకుంటూ బరువు పెరగకుండా చూసుకోవడం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ముఖ్యంగా మహిళలు రోజుకు కనీసం 30 నిమిషాల వ్యాయామం చేయడం వల్ల రక్తప్రవాహం సాఫీగా మారి రక్తపు గడ్డలు ఏర్పడకుండా ఉంటుంది.
- తగినన్ని నీళ్లు, ద్రవాహారాలు తీసుకుంటూ ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉండటం.
- ఒకే చోట స్థిరంగా కూర్చుని ఉండకుండా కాసేపు నడక, స్ట్రెచ్చింగ్ వంటివి చేస్తూ ఉండటం.
- దూర ప్రయాణాలు చేస్తున్నప్పుడు అదేపనిగా వాహనంలో కూర్చుని ఉండకుండా తరచూ బ్రేక్ తీసుకోవటం.
- రక్తనాళాల్లో రక్తప్రవాహం సాఫీగా సాగేందుకు కంప్రెషన్ స్టాకింగ్ వంటివి వాడటం.
- గర్భం దాల్చిన మహిళల కుటుంబ సభ్యుల్లో డీప్ వీన్ థ్రాంబోసిస్ వచ్చిన ఆరోగ్య చరిత్ర ఉంటే ముందే డాక్టర్‌కు ఈ విషయాన్ని చెప్పడం మంచిది.

చికిత్స...

డీవీటీ వచ్చే అవకాశాలున్న వారు సపోర్ట్ స్టాకింగ్స్ / కంప్రెషన్ స్టాకింగ్స్ వాడటం.

రక్తాన్ని పలచబార్చే మందులైన యాంటీ కోయాగ్యులెంట్స్ వాడటం..

- **క్లాట్ బస్టర్స్ / థ్రాంబోలైటిక్స్ చికిత్స :** చిన్న పైప్ (క్యాథెటర్) ద్వారా రక్తం గడ్డకట్టిన చోటికి థ్రాంబోలైటిక్స్ అని పిలిచే మందును పంపి, రక్తపుగడ్డను చెదరగొట్టే ఔషధాల్ని వాడటం.



డాక్టర్ నరేంద్రనాథ్ మేడ,
కన్సల్టెంట్ వాస్క్యులార్ & ఎండో వాస్క్యులార్ సర్జన్

మెడి టిప్
చెవుల సంరక్షణ కోసం...!


చెవులను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి... ● పల్లెటూళ్లలో వేసవి సెలవులు రాగానే ఈత నేర్చుకోవడం కోసం పిల్లలు నీటి కుంటలు, చెరువులకు వెళ్తుంటారు. చెరువుల్లోని మురికి నీరు చెవుల్లోకి చేరి ఇన్ఫెక్షన్లు రావచ్చు. అందువల్ల ఈత నేర్చుకోవాలనుకునే పిల్లలు పరిశుభ్రమైన నీళ్లలోనే దిగాలి. ● చెవులను శుభ్రం చేయడానికి కొందరు గోరువెచ్చగా కాచిన కొబ్బరి నూనె, ఆముదం చెవుల్లో పోస్తారు. ఇలా ఎట్టిపరిస్థితుల్లోనూ చేయకూడదు. ● అపరిశుభ్రమైన నీటితో తయారు చేసే ఐస్‌క్రీముల వంటివాటితో గొంతుకు సంబంధించిన ఇన్ఫెక్షన్లు వస్తాయి. అవే ఇన్ఫెక్షన్లు చెవులకూ సోకే ప్రమాదం ఉంది. కాబట్టి చెవి, గొంతు, ముక్కు... భాగాల్లో ఎక్కడ ఇన్ఫెక్షన్ కనిపించినా నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా పిల్లల విషయంలో ఈ జాగ్రత్తను మరింతగా పాటించాలి.

పై జాగ్రత్తలు పాటించాక కూడా... గులివి, చీము వంటి సమమస్యలతో పాటు... చెవిపోటు ఎక్కువగా వస్తున్నా, సరిగా వినిపించకపోయినా... వీలైనంత త్వరగా ఈఎన్‌టీ వైద్యనిపుణులను సంప్రదించాలి.

గుండె పెరగడం అంటే..?

గుండె పెరిగే సమస్యను ఇంగ్లిష్‌లో హార్ట్ ఎన్‌లార్జ్‌మెంట్ అనీ, వైద్య పరిభాషలో కార్డియో మెగాలీ అని అంటారు. నిజానికి ఇదేమీ వ్యాధి కాదు. కొన్ని ఇతర ఆరోగ్య సమస్యలు (మెడికల్ కండిషన్లు) కారణంగా కనిపించే ఒక లక్షణం. గుండె ఎందుకు విస్తరిస్తుందో, అందుకు కారణమయ్యే ఆరోగ్య సమస్యలేమిటో, దీని నివారణ, చికిత్స ప్రక్రియలను తెలుసుకుందాం.

రక్తాన్ని సరఫరా చేసే ఓ పంప్ లాంటిది గుండె. ఈ పంపు బలహీనమైనప్పుడు శరీరానికి అవసరమైన రక్తాన్ని సరఫరా చేయలేదు. ఈ పరిస్థితినే హార్ట్ ఫెయిల్యూర్ అంటారు. గుండెపై ఒత్తిడి పెరిగినప్పుడు గుండె విస్తరిస్తుంది. కొందరిలో ఈ పరిస్థితి తాత్కాలికం కాగా... మరికొందరిలో ఎప్పటికీ మందులు వాడటం, చికిత్స కొనసాగించడం అవసరం కావచ్చు. ఈ సమస్య తీవ్రమైనదా కాదా అన్నది గుండె పెరగడానికి కారణమైన అంశాన్ని బట్టి ఉంటుంది.



గుండె పెరగడం... రకాలు...

గుండె కాస్త పెరిగినప్పటికీ... ఒక దశ వరకూ అది మామూలుగానే పనిచేస్తుంది. ఒక దశకు చేరాకే అనర్థాలు కనిపిస్తాయి. గుండె పెరిగిన కారణాలూ, తీరును బట్టి ఇందులో కొన్ని రకాలు ఉంటాయి. అవి...

- డయలేటెడ్ కార్డియోమయోపతి కారణంగా గుండె పెరిగితే ఇందులో గుండె కింది గదులు (వెంట్రికిల్స్) రెండూ పెరుగుతాయి.
- అధిక రక్తపోటు కారణంగా గుండె ఎడమవైపు కింది గది మందంగా మారవచ్చు. ఇలా కండరం మందంగా మారి గుండె పెరగడాన్ని 'హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతి' అంటారు.
- ఒక్కోసారి ఏ కారణమూ లేకుండానే గుండెపెరగవచ్చు లేదా ఇతమిత్థంగా కారణం తెలియకపోవచ్చు. ఈ పరిస్థితిని ఇడియోపతిక్ డయలేటెడ్ కార్డియో మయోపతి అంటారు.

కారణాలు...


- గుండె కండరానికి ఇన్ఫెక్షన్ (మయోకార్డైటిస్) వచ్చేలా చేసే వైరల్ ఇన్ఫెక్షన్లు.
- గుండెకు ఉండే నాలుగు కవాటాల్లో ఏదైనా దెబ్బ తినడం వల్ల కొన్ని గదుల్లోకి రక్తం ఎక్కువగా వెళ్తా ఉండటం.
- గుండె చుట్టూరా ఉండే ఒక పొరలోకి ద్రవాలు చేరడం వల్ల ఇలా జరగడాన్ని పెరికార్డియల్ ఎఫ్యూజన్ అంటారు. దీన్ని ఎక్స్-రే ద్వారా కనుగొంటారు.
- రక్తహీనత వల్ల అన్ని అవయవాలకూ ఆక్సిజన్ తగినంతగా అందదు. అలా అందించే ప్రయత్నంలో గుండె మరింత ఎక్కువగా పని చేయాల్సి రావడంతో.
- మహిళల్లో గర్భధారణ సమయంలో గుండె పెరిగే కండిషన్ అయిన పెరిపార్టమ్ కార్డియోమయోపతి వల్ల.
- కార్డియాక్ అమైలాయిడోసిస్ అనే కండిషన్‌లో రక్తంలో అమైలాయిడ్ ప్రోటీన్ మోతాదులు పెరగడంతో (ఇందులో గుండె గోడలు మందంగా మారతాయి).
- దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో బాధపడేవారిలో
- థైరాయిడ్ గ్రంథి స్రావంలో అసమతుల్యతల వల్ల
- పల్మనరీ హైపర్‌టెన్షన్ అనే హైబీపీ ఉన్నవారిలో రక్తపోటు వల్ల గుండె మరింత ఎక్కువగా పనిచేయాల్సి రావడంతో గుండె కుడివైపు గదులు పెరగవచ్చు.
- మద్యం తాగేవారిలో లేదా మాదకద్రవ్యాలు తీసుకునేవారిలో దీర్ఘకాలంలో గుండె పెరిగే ప్రమాదం ఉంది.
- కొందరిలో జన్యు సమస్యల కారణంగా పుట్టుకతోనే గుండె, దాని విధుల్లో తేడాలు రావడంతో పాటు గుండె పెరగవచ్చు.

లక్షణాలు... ● శ్వాస సరిగా అందకపోవడం ● కాళ్ల / పాదాల వాపు ● బరువు పెరగడం (ముఖ్యంగా దేహం మధ్యభాగంలో... సెంట్రల్ ఒబేసిటీ) ● తీవ్రమైన అలసట ● కొందరిలో గుండెదడ లేదా గుండె లయ తప్పడం.

నిర్ధారణ పరీక్షలు: కొన్ని రక్తపరీక్షలు, ఛాతీ ఎక్స్-రే, సీటీ లేదా ఎమ్మారై స్కాన్, ట్రెడ్‌మిల్‌పై చేయించే స్ట్రెస్ పరీక్ష, అరుదుగా గుండె కండరాన్ని సేకరించి చేసే బయాప్సీ.

చికిత్స... గుండె పెరగడానికి కారణమైన అంశం ఆధారంగా చికిత్స చేస్తారు. ఉదాహరణకు... ● గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో అడ్డంకి ఏర్పడటం వల్ల వచ్చే కరోనరీ ఆర్టరీ డిసీజ్‌లో ఆ అడ్డంకి తొలగింపు ద్వారా. ● రక్తపోటును నియంత్రించే మందుల్ని వాడటం ద్వారా. ● గుండె కవాటాలలో లోపాల వల్ల గుండె పెరిగితే వాల్వ్‌లకు తగిన రిపేరు చేయడం లేదా శస్త్రచికిత్స ద్వారా. ● మద్యపానం లేదా మాదక ద్రవ్యాల వల్ల గుండె పెరిగితే ఆ అలవాటును మాన్పించడం ద్వారా.

ఇతర మందుల వాడకంతోనూ... కాళ్లవాపులు అధికంగా ఉన్నప్పుడు అధికంగా మూత్రం వచ్చేలా చేసే డై-యూరెటిక్స్‌తో ● రక్తపోటు పెరిగినప్పుడు యాంజియోటెన్సిన్ – కన్వర్టింగ్ ఎంజైమ్ ఇన్హిబిటార్స్, బీటా బ్లాకర్స్ వంటి మందులతో. ● రక్తాన్ని పలచబార్చే యాంటీ కోయాగ్యులెంట్స్‌తో. ● గుండె లయ తప్పినప్పుడు యాంటీ అరిథ్మియా డ్రగ్ అనే మందును వాడతారు. ● గుండె కొట్టుకోవడం ఆగితే ఇంప్లాంటబుల్ కార్డియోవెర్టర్ డీ ఫ్రిబిలేటర్‌తో తిరిగి గుండె కొట్టుకునేలా చేస్తారు. ● గుండె స్పందనల వేగం పెరిగినా లేదా తగ్గినా క్రమబద్ధం చేసే 'పేస్‌మేకర్' అమర్చడం ద్వారా. ● లెఫ్ట్ వెంట్రిక్యులార్ అసిస్ట్ డివైస్ (ఎల్‌వీఏడీ) అనే ఉపకరణాన్ని.. గుండెమార్పిడి శస్త్రచికిత్స అవసరమైన వారు తమకు సరిపడే గుండెకోసం వేచి చూస్తున్నప్పుడు... ● గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో అడ్డంకులు (బ్లాక్స్) చాలా ఎక్కువగా ఉన్నప్పుడు బైపాస్ శస్త్రచికిత్సతో... ● చివరి ప్రత్యామ్నాయంగా గుండె మార్పిడి (హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్) చికిత్సతో పరిస్థితిని చక్కదిద్దుతారు.



డా. కరుణాకర్ రాపోలు
ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్